సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



గుంత పూడ్చినా..

పైప్‌లైన్ మరమ్మతు పేరిట కార్పొరేషన్ అధికారులు రోడ్డును తవ్వారు. అనంతరం పూడ్చడంలో నిర్లక్ష్యం చేశారు. 8లో▸



ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు

ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు ఎంతో అవసరమని న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ కోచ్ బాల్‌రాజ్ అన్నారు. 8లో▸



వ్యక్తిపై కుక్క దాడి

నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిపై కుక్క దాడి చేసిన ఘటన కేశంపేట మండల పరిధిలోని ఇప్పలపల్లిలో చోటుచేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

యువత చేతిలోనే దేశభవిష్యత్

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ, బీజేవైఎం నాయకులు

చేవెళ్ల: యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు పత్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రోడ్డుపై జాతీయ జెండాలతో ప్రదర్శనగా వెళ్లి.. అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ పాలనలో దేశం సురక్షితంగా ఉందన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఒక పండుగలా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఓబీసీ కార్యదర్శి ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 160 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్లు ప్రతిమాసింగ్,భూపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, కష్టాలను అధికారులకు విన్నవించారు. మొత్తంగా 160 అర్జీలు అందాయి. వాటికి సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు భూపాల్‌రెడ్డి, ప్రతిమాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములను రక్షించాలి

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం సర్వేనంబర్ 376లోని ప్రభుత్వ, సీలింగ్ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ ప్రజావాణిలో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే 223 ఎకరాల పట్టా భూమిలో శ్రీమిత్ర రియల్ ఎస్టేట్ సంస్థ ప్లాట్లు చేసి విక్రయించిందన్నారు. ఇదే సర్వేనంబర్‌లో ఉన్న 36 ఎకరాల సీలింగ్ భూమిని ఆక్రమించుకుని సదరు సంస్థతో కొంతమంది మాజీ ప్రజాప్రతినిధులు చేతులు కలిపి తాజాగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు.ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి ఆక్రమణకు గురైన సీలింగ్ భూ ములను కాపాడాలని,అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్రిపుల్ ఐటీల్లో 'మోడల్' విద్యార్థుల ప్రతిభ



మునావత్ సిద్ధు



కాత్రావత్ శివ

మహేశ్వరం: మహేశ్వరం మోడల్ స్కూల్‌లో (2023– 24) ఇంటర్ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థులు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఐఐటీలో సీట్లు సాధించారు. మునావత్ సిద్ధు త్రిపుర రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ అగర్తలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో, కాత్రావత్ శివ మణిపూర్ రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీ ఇంఫాల్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బి.ధనుంజయ్ మాట్లాడుతూ.. తమ విద్యార్థులు దేశంలో ఉన్న ప్రముఖ యూనివర్సిటీల్లో ఐఐటీ సీట్లు సాధించి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవడం గర్వంగా ఉందన్నారు. మిగతా విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుతూ భవిష్యత్తులో వీరిని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆయా సబ్జెక్టుల్లో శిక్షణ ఇస్తూ.. వారి సందేహాలను నివృత్తి చేస్తూ.. విలువైన సూచనలిస్తూ విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులను అభినందించారు.

పారిశుద్ధ్య నిర్వహణకు సమగ్ర ప్రణాళిక

సాక్షి ఫోన్ ఇన్

శ్రీరాంనగర్, సింగాపురం టవర్, అయ్యప్పరెడ్డి 'పారిశుద్ధ్య నిర్వహణకు సమగ్ర ప్రణాళికను రూపొందించాం. సమస్యలను గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నాం. పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం' అని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'ఫోన్ ఇన్'కు విశేష స్పందన లభించింది. ఆయా వార్డుల్లోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఆయన సిబ్బందితో కలిసి వాటిని నోట్ చేసుకున్నారు. వీలైనంత త్వరగా అన్నింటికీ పరిష్కారం చూపుతామని తెలిపారు.

– శంకర్‌పల్లి

సమస్యల పరిష్కారానికి కృషి

- శునకాల బెడదను నివారిస్తున్నాం
- మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధే ధ్యేయం
- శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్, పక్కన నోట్ చేసుకుంటున్న సిబ్బంది

గూడ, బొప్పన్న వెంచర్, క్రిస్టల్ టౌన్‌షిప్‌లో వీధి కుక్కలు విపరీతంగా ఉన్నాయి. వీటితో ఇప్పటికే పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు.

– శ్రీనివాస్, లోకేష్ , శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ, బక్కారెడ్డి

కమిషనర్: వీధి శునకాలపై ఇప్పటికే కౌన్సిల్‌లో చర్చించాం. రూ. 8.75 లక్షలతో బ్లూక్రాస్ సొసైటీతో ఒప్పందం చేసుకున్నాం. కుక్కల తరలింపు కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి. ఒక్కో కుక్క తరలింపు కోసం రూ.1,650 వెచ్చిస్తున్నాం.

పట్టణంలోని క్రిస్టల్ టౌన్‌షిప్‌లో ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున చెత్తా చెదారం పేరుకుపోయింది. ముళ్ల పొదలు పెరగడంతో పాములు, దోమలు, ఈగల సమస్య తీవ్రమైంది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– సత్యనారాయణ రావు, క్రిస్టల్ టౌన్‌షిప్

కమిషనర్: ఖాళీ స్థలాల్లో చెత్త సమస్య ఇప్పుడే మా దృష్టికి వచ్చింది. అధికారులను పంపి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తాం.

బుల్కాపూర్ చౌరస్తా వద్ద, సింగాపురం టవర్, గీతా మందిర్, శ్రీరాంనగర్ కాలనీ, అయ్యప్పరెడ్డి గూడ, బొప్పన్న వెంచర్లలో విద్యుత్ స్తంభాలు వంగిపోయాయి. చాలా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు.

– మహేందర్, దండు రాజేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, రామకృష్ణ, అజాది

కమిషనర్: విద్యుత్ స్తంభాల సమస్యను శంకర్‌పల్లి ఏఈ దృష్టికి తీసుకు వెళ్తాను. వీధి దీపాలను మున్సిపల్ ద్వారా ఏర్పాటు చేయిస్తాం.

శంకర్‌పల్లి కూరగాయల మార్కెట్ ఏరియాలో నిత్యం వ్యాపారులు వ్యర్థాలు పారబోస్తున్నారు. వ్యాపారులకు సరైన మరుగుదొడ్లు లేక బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.

– బీర్ల సురేష్, శ్రీనివాస్, 3వ వార్డు

కమిషనర్: కూరగాయల వ్యర్థాలను ఎప్పటికప్పుడు కార్మికులతో తొలగిస్తున్నాం. పబ్లిక్ టాయిలెట్స్ కోసం వచ్చే కౌన్సిల్‌లో చర్చించి, నిర్మిస్తాం.

శంకర్‌పల్లి పట్టణం నుంచి కూరగాయల మార్కెట్‌కి వెళ్లే రహదారిపై దుకాణాలకి వచ్చే వాహనదారులు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. అదే ఏరియాలో ఆస్పత్రులు ఉండదంతో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే వారికి ఇబ్బంది తలెత్తుతోంది.

– రంగనాథ్, 3వ వార్డు

కమిషనర్: చేవెళ్ల ట్రాఫిక్ సీఐతో మాట్లాడతాను. టౌన్‌ప్లానింగ్ అధికారులను పంపి, అక్రమంగా రోడ్లపై నిర్మించిన షెడ్లను తొలగించి, సమస్యను పరిష్కరిస్తాం.

పట్టణంలో సరైన స్పోర్ట్స్ స్టేడియం లేదు. శ్రీరాంనగర్ కాలనీలో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తేవాలి. పట్టణవాసులు సెలవులు, వారంతాల్లో సేద తీరడానికి ఎలాంటి పార్కులు లేవు.

– వీరేందర్, శంకర్‌పల్లి

కమిషనర్: త్వరలోనే ఇండోర్ స్టేడియాన్ని వినియోగంలోకి తెస్తాం. దాని పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాం. మున్సిపల్ ఖాళీ స్థలాల్లో పార్కులు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

మున్సిపాలిటీకి ఇప్పటి వరకు సరైన డంపింగ్ యార్డు లేదు. ఉన్న దాంట్లో ఇష్టారీతిన చెత్తాచెదారం వేయడం, కాల్చడంతో అక్కడే పొలాలున్న రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్లాస్టిక్ తిని మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి.

– అఖిల్‌రెడ్డి, హరీష్, సింగాపురం

కమిషనర్: డంపింగ్ యార్డు కోసం ఐదెకరాలు ఇవ్వాలని ఇప్పటికే తహసీల్దార్‌ని అడిగాం. ఇటీవల శంకర్‌పల్లిలో పర్యటించిన అడిషనల్ కలెక్టర్‌కి సైతం సమస్యను వివరించాం. త్వరలో పరిష్కరించేలా చూస్తాం.

సింగాపురం వెళ్లే ప్రధాన రహదారిపై కిలోమీటర్ మేర గుంతలతో బురదమయంగా తయారైంది. దీనిపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– వెంకట్‌రాంరెడ్డి, సింగాపురం

కమిషనర్: సింగాపురం వెళ్లే ప్రధాన రహదారి పనులకు నిధులు మంజూరయ్యాయి. 800 మీటర్ల మేర 22 ఫీట్ల వెడల్పుతో సీసీ రోడ్డును నిర్మిస్తాం. మంత్రుల షెడ్యూల్ కోసం చూస్తున్నాం. వారంలో పనులు ప్రారంభిస్తాం.

బీడీఎల్ చౌరస్తా నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకు నిర్మించిన ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగునీటి కాలువ నిర్మిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు సగం పనులే చేసి వదిలేశారు. ఆక్రమణలు సైతం గుర్తించాలి.

– పాండురంగం, శంకర్‌పల్లి

కమిషనర్: టీయూఎఫ్ఐడీసీ కింద నిధులు విడుదలయ్యాయి. పనులను తిరిగి త్వరలోనే ప్రారంభిస్తాం. టీపీఓని పంపి ఆక్రమణలు గుర్తించి, తొలగిస్తాం.

పట్టణంలోని రిత్విక్ వెంచర్, వీరభద్రీయ సంఘం ఏరియాలో దోమల బెడద ఎక్కువగా ఉంది. ఇప్పటి వరకు ఫాగింగ్ చేయలేదు.

– కిశోర్ కార్తీక్, రిజ్వానా

కమిషనర్: మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. మీ ప్రాంతంలో త్వరలోనే ఫాగింగ్ చేపిస్తా.

రోజు వారీ చెత్త సేకరణ జరగడం లేదు. మా వార్డుకి చెత్త సేకరణ వాహనం సైతం లేదు. మురుగునీటి కాలువల శుభ్రం కోసం వినతులు ఇచ్చినా పట్టించుకోవడం లేదు.

– అనంత్‌రెడ్డి, రాంరెడ్డి, బుల్కాపూర్

కమిషనర్: ప్రతి రెండు రోజులకోసారి చెత్త సేకరణ చేయిస్తున్నాం. సమస్యను గుర్తించి, పరిష్కరిస్తాం. కౌన్సిల్‌లో మాట్లాడి చెత్త సేకరణ వాహనాన్ని కొనుగోలు చేసేందుకు చూస్తున్నాం.

'హైడ్రా' డ్రామాలు చేయదు

- చెరువుల పరిరక్షణకు కట్టుబడి ఉంది
- దీనికోసం మూడు దశల్లో కార్యాచరణ
- ఓఆర్ఆర్ పరిధిగా 72 బృందాలు
- రాజకీయ విమర్శలు పట్టించుకోను
- విలేకరులతో కమిషనర్ రంగనాథ్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విపత్తుల నిర్వహణ, ఆస్తుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (హైడ్రా) చెరువులు, కుంటలు పరిరక్షణకు కట్టుబడి ఉందని ఆ విభాగం కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. దీనికోసం తీసుకుంటున్న చర్యలపై రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై స్పందించనని, వాటిని వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిగా ఫుల్ ట్యాంక్ లెవల్స్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్స్‌లో ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు కట్టుబడి ఉన్నామని, ఈ వ్యవహారంలో సమావేశాలు, సంప్రదింపులు, నోటీసులు వంటి డ్రామాలకు ఆస్కారం లేదని ఆయన స్పష్టం చేశారు. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివరాలివి.. ఆక్రమణదారులు చెరువుల్ని పూడ్చేసినప్పటికీ క్యాచ్‌మెంట్ ఏరియా ద్వారా ప్రవాహదిశను మార్చలేరు. ఈ కారణంగానే ఆక్రమణకు గురైన ప్రాంతాలతో పాటు కొత్త ఏరియాలపైనా వరదల ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు, ఆక్రమణలపై హైడ్రా కఠిన చర్యలు తీసుకుంటోంది. చందానగర్ ఈర్ల చెరువుకు సంబంధించిన బఫర్ జోన్‌లో నిర్మాణాలకు అనుమతి ఇచ్చారంటూ ఇరిగేషన్ అధికారులు ఈ ఏడాది మార్చి 6న ఫిర్యాదు చేశారు. దీనిపై మేలో జీహెచ్‌ఎంసీ బిల్డర్‌కు నోటీసులు జారీ చేసి కూల్చివేస్తున్నట్లు భవనానికి రంధ్రాలు కూడా పెట్టింది. బిల్డర్ వాటిపై కాంక్రీట్ చేసి మరీ నిర్మాణం చేపడుతున్నాడు. భవన నిర్మాణం పూర్తి కాకుండానే ఈ ఏడాది మార్చిలో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) జారీ అయింది. అనుమతి నుంచి ఓసీ ఇవ్వడం వరకు బాధ్యులైన అధికారులపైనా విచారణ చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం. నందగిరిహిల్స్‌లో ఆక్రమణకు గురవుతున్న పార్కును కాపాడాం. జీహెచ్‌ఎంసీ ద్వారా ఫెన్సింగ్ వేయించాలంటే టెండర్లు పిలవడం, పనులు కేటాయించడం వంటి ప్రక్రియలతో ఆలస్యమవుతుంది. ఈ నేపథ్యంలోనే కాలనీవాసుల సాయం తీసుకుంటున్నాం.

త్వరలో వెబ్‌సైట్‌లో వివరాలు

చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు హైడ్రా మూడు దశల్లో కార్యాచరణ అమలు చేస్తోంది. మొదటి దశలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఒక్క చదరపు అడుగు కూడా ఆక్రమణ కాకుండా చూస్తోంది. అందులో భాగంగా నిర్మాణాలు కూల్చివేస్తున్నాం. రెండో దశలో ఇప్పటికే ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో ఉన్న అనుమతి ఉన్న, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటాం. మూడో దశలో బెంగళూరు మాదిరిగా చెరువుల పునరుద్ధరణ చేపడతాం. ప్రస్తుతం మొదటి దశ నడుస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో నిర్మాణాలు, లేఔట్లలో ప్లాట్లు, స్థలాలు ఖరీదు చేయొద్దు. త్వరలో ఈ వివరాలను వెబ్‌సైట్‌లో పెడతాం. ఇప్పటికే ఇలా ఖరీదు చేసి నష్టపోయిన వాళ్లుంటే బిల్డర్‌పై కేసు పెట్టండి.

మూడు జోన్లుగా విభజన

ఓఆర్ఆర్ లోపల ఉన్న 2050 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటవుతున్న హైడ్రాను మూడు జోన్లుగా విభజించాలని భావిస్తున్నాం. కొత్తగా వచ్చే 3,500 సిబ్బంది నుంచి కొందరిని ఎంపిక చేసి 72 బృందాలు ఏర్పాటు చేస్తాం. విపత్తు నిర్వహణ బృందాలు ట్రాఫిక్ పోలీసులతో, ఆస్తుల పరిరక్షణ బృందాలు జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని పని చేస్తాయి. ఏసీపీ స్థాయి అధికారి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉండే హైడ్రా ఠాణా ఏర్పాటవుతుంది. ఆక్రమణలు, నకిలీ పత్రాల సృష్టి తదితర కేసుల్ని ఇది దర్యాప్తు చేస్తుంది. చెరువులు, కుంటలకు సంబంధించి అన్ని ప్రభుత్వ విభాగాలతో ఉమ్మడి డేటాబేస్ ఏర్పాటు చేస్తాం. అనేక ఆక్రమణల వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోంది. 'గ్రేటర్'లో ఉన్న ప్రతి చెరువు, కుంట పూర్వాపరాలు అధ్యయనం చేస్తున్నాం. కూల్చివేతలు చట్ట ప్రకారం జరుగుతాయి. నీటి వనరులు, ప్రభుత్వ స్థలాలు పూడ్చే ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్ చేస్తాం. చెరువు, పార్కు స్థలాలకు ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్‌లు వర్తించవు. ఆక్రమణలపై ప్రజలు ఫిర్యాదు చేయాలి. గతంలో వచ్చిన ఫిర్యాదులను పరిగణలోకి తీసుకుంటున్నాం.



ఆమనగల్లు ప్రభుత్వాస్పత్రి వద్ద చికిత్సకోసం క్యూలో ఉన్న రోగులు

పల్లెకు సుస్తీ

- దగ్గు, జలుబు, జ్వరంతో హాస్పిటళ్లకు క్యూ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస వైద్య సేవలు కరువు
- స్టాఫ్ నర్సులే డాక్టర్ల అవతారం ఎత్తుతున్న వైనం
- ఇంటింటి ఫీవర్ సర్వే అంతంతే..
- 'సాక్షి' విజిట్‌లో వెలుగు చూసిన అంశాలు



ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడులో పరీక్షలు నిర్వహిస్తున్న స్టాఫ్ నర్సులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పల్లెకు సుస్తీ చేసింది. చికిత్స చేసేందుకు సరైన వైద్యులు లేక బాధితులు విలవిల్లాడుతున్నారు. ఆరోగ్య రాజధాని హైదరాబాద్‌కు ఆనుకుని ఉన్న జిల్లాలో కనీస వైద్యసేవలు అందకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. గుండె, కిడ్నీ, కాలేయం వంటి సమస్యలకే కాదు సాధారణ జ్వరం, తలనొప్పి, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు.. ఇలా ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా.. సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. రోగుల్లో ఉన్న బలహీనతను అవకాశంగా తీసుకుని ఆయా ప్రైవేటు ఆస్పత్రుల్లోని వైద్యులు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఇన్‌పేషంట్ సేవల పేరుతో 'క్యాష్' చేసుకుంటున్నారు. 'సాక్షి' బృందం సోమవారం రంగారెడ్డి జిల్లాలోని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో విజిట్ చేసింది. ఆయా ఆస్పత్రులకు వస్తున్న రోగులు, అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీసింది. మెజార్టీ ఆస్పత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ల్యాబ్‌లు లేవు. రోగుల నుంచి నమూనాలు సేకరించి కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి పంపుతున్నా.. సకాలంలో రిపోర్టులు రాకపోవడంతో అప్పటికే జ్వరం తీవ్రమై..ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఆయా ఆస్పత్రుల వైద్యులు సాధారణ జ్వరాన్ని కూడా డెంగీగా అనుమానించి, అడ్మిట్ చేసుకుంటున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ప్లేట్‌లెట్స్ ఎక్కింపు చికిత్సల పేరుతో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

వెలుగు చూసిన లోపాలు

- వర్షాలతో పల్లెల్లో చాలా మంది మంచం పట్టారు. కీళ్ల నొప్పులు, వాంతులు, విరేచనాలతో పాటు విషజ్వరాలతో బాధపడుతున్నారు. రోగుల గుర్తింపు కోసం ఇంటింటా జ్వర సర్వే చేపడుతున్నట్లు చెబుతున్నా.. ఆచరణలో ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు.
- యాచారం సీహెచ్‌సీకి 200 మందికిపైగా వచ్చారు. వీరిలో 50 శాతం జ్వరపీడితులే. కుక్కకాటు ఇంజక్షన్లు లేకపోవడంతో ఐపీఎంకు పరుగులు తీయాల్సి వస్తోంది.
- చేవెళ్ల ఆస్పత్రికి రోజుకు సగటున 300 మంది వస్తున్నారు. సరిపడా వైద్యులు లేకపోవడం, ఉన్నవాళ్లు ఓపీకే పరిమితం అవుతుండటతో ఇన్‌పేషంట్ సేవలు అందడం లేదు. ఫార్మాసిస్టులు లేకపోవడంతో సూపర్‌వైజర్ మందులు పంపిణీ చేయాల్సి వస్తోంది.
- బడంగ్‌పేట పట్టణ ఆరోగ్యకేంద్రానికి 9 గంటలకు రావాల్సిన డాక్టర్ 11 గంటలకు వచ్చి, ఆ తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకే ఇంటిముఖం పట్టారు. పాము కాటు, కుక్కకాటు వంటి నిరోధక టీకాలు లేవు. ఏఎన్ఎంలే వచ్చిన వారికి మందులిచ్చి పంపుతున్నారు.
- మైసిగండి పీహెచ్‌సీకి రోజుకు సగటున 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నారు. సాధారణ సీజనల్ వ్యాధులతో బాధపడే వారికి, మందులు ఇచ్చి పంపుతున్నారు. తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్న వారు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.
- ఎల్మినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులున్నా ఉదయం 10.30 దాటినా పత్తాలేరు. చివరికి స్టాఫ్ నర్సులే వైద్యుల అవతారం ఎత్తాల్సి వచ్చింది.
- సరూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి రోజుకు సగటున 150–200 మంది రోగులు వస్తుంటారు. వీరి నిష్పత్తి మేరకు వైద్యులు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.
- వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి రోజుకు సగటున 500 మంది రోగులు వస్తుండగా,వీరిలో 30 మందికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ అవుతోంది.మరో 50కి పైగా కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. రోగుల నిష్పత్తి మేరకు ఓపీ కౌంటర్లు, వైద్య పరికరాలు లేకపోవడంతో గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వస్తోంది.

గత రెండేళ్లలో జిల్లాలో నమోదైన సీజనల్ వ్యాధులు

వ్యాధి	2023	2024
డయేరియా	1,264	686
ఫీవర్	17,552	9,388
శ్వాసకోశ సమస్యలు	826	136
హెచ్1ఎన్1	79	02
డెంగీ	522	179
మలేరియా	1	3
చికెన్‌గున్యా	2	-

- వివరాలు 8లో▸



ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

పంద్రాగస్టుకు పక్కాగా ఏర్పాట్లు

- కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ భవన కార్యాలయ సముదాయంలో సోమవారం స్వాతంత్య్ర దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే వేడుకల్లో వీఐపీలు, అధికారులు, మీడియా, ఇతరులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారులకు సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ముఖ్యఅతిథి సందేశం, ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. వేడుకలకు వచ్చే అతిథికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. వేదికను అందంగా అలంకరించాలని ఉద్యాన శాఖ సిబ్బందికి పురమాయించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని డీఈఓకు చెప్పారు. ఎక్కడా, ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుంత పూడ్చినా.. తీరని చింత



రోడ్డుపై గుంత పూడ్చివేసిన ప్రాంతం



బోల్తాపడిన ఆటో

మట్టిపోసి చేతులు దులుపుకొన్న సిబ్బంది

బడంగ్‌పేట్: పైప్‌లైన్ మరమ్మతు పేరిట కార్పొరేషన్ అధికారులు రోడ్డును తవ్వారు. అనంతరం పూడ్చడంలో నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా వాహనదారులు ప్రమాదంలో పడుతున్నారు. బడంగ్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట అరోమా ఆస్పత్రి, మీసేవా కేంద్రం ప్రధాన రహదారిలో (బీటీరోడ్డు)పై పక్షం రోజుల క్రితం వాటర్ పైప్‌లైన్ లీకేజీ కాగా.. కార్పొరేషన్ అధికారులు మరమ్మతు చేయించారు. కానీ.. గుంతను మట్టిని ఎత్తుగా పోసి పూడ్చారు. ఎలాంటి సూచిక బోర్డు పెట్టకుండా వదిలేశారు. దీనివలన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒకవైపు డివైడర్, మరోవైపు రోడ్డు దిగితే తిరిగి వాహనం ఎక్కలేని దుస్థితి. మధ్యలో తవ్విన గుంత. ఇదే ప్రమాదాలకు దారి తీస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ వాహనాలకు వచ్చిన ముప్పేమీ లేదని, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని స్థానికులు తెలిపారు. గుంత వలన సోమవారం ఒక్క రోజే రెండు బైకులు, రెండు ఆటోలు ప్రమాదానికి గురై.. పలువురు గాయపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే బడంగ్‌పేట–బాలాపూర్ చౌరస్తాకు వెళ్లే రహదారిపై ఇలా ఇష్టానుసారంగా తవ్వి, ప్రమాణాలు పాటించకుండా పూడ్చివేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి గుంతను చదును చేసి, రవాణాకు అనుగుణంగా మరమ్మతు చేయించాలని ప్రాంత ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా మహేశ్



నియామకపత్రం అందుకుంటున్న మహేశ్

ఇబ్రహీంపట్నం: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నానికి చెందిన బండి మహేశ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం సంఘం జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవినిచ్చిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. మాలల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు.

ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు



విద్యార్థులతో మాస్టర్లు

షాద్‌నగర్: ఆత్మరక్షణకు యుద్ధ విద్యలు ఎంతో అవసరమని న్యూ పవర్ కుంగ్‌ఫూ అకాడమీ కోచ్ బాల్‌రాజ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలో సోమవారం నిర్వహించిన 2వ జాతీయ స్థాయి ఓపెన్ టు ఆల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో షాద్‌నగర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. బ్లాక్ బెల్టు విభాగంలో ఆర్తి, బ్రౌన్ బెల్టు విభాగంలో సిద్ధు గోల్డ్ మెడల్ సాధించగా నిఖిత, బ్రౌన్ బెల్టు, ఏన్స గ్రీన్ బెల్టు సాధించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

తలకొండపల్లి: వరకట్నం వేధింపులకు పాల్పడి.. ఓ వివాహిత మరణానికి కారకులైన ఒకే కుటుంబంలోని ముగ్గురికి కోర్టు జీవిత కాల శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి పూల్‌సింగ్ తండాకు చెందిన పాత్లావత్ సురేందర్‌తో, సునీతకు వివాహం జరిగింది. కట్నంగా రూ.5 లక్షల నగదు, రెండు తులాలు బంగారు ఆభరణాలు ఇచ్చారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలు పుట్టిన తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త సురేందర్‌తో పాటు అత్త పీక్లి, ఆడపడచు సంతోష నిత్యం సునీతను వేధించేవారు. శారీరకంగా, మానసికంగా హింసించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సునీత 2021 జనవరి 10న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఏసీపీ కుశాల్కర్ ఎల్‌బీనగర్ కోర్టుకు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన అనంతరం న్యాయమూర్తి హరీష తీర్పు వెల్లడించారు. కేసును పరిష్కరించిన ఏసీపీ కుశాల్కర్, ఎస్ఐ వరప్రసాద్, పర్యవేక్షక అధికారి ప్రమోద్‌కుమార్‌ను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

వ్యక్తిపై కుక్క దాడి



టీకా తీసుకుంటున్న బాధితుడు

కేశంపేట: నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిపై కుక్క దాడి చేసిన ఘటన మండల పరిధిలోని ఇప్పలపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుడి తెలిపిన వివరాల ప్రకారం.. పాపిరెడ్డిగూడకు చెందిన అబ్బి మల్లయ్య ఇప్పలపల్లిలో బోర్‌మోటార్ వైండింగ్ పనులు చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే నడుచుకుంటూ వెళ్తున్న అతనిపై వీధికుక్క దాడికి పాల్పడింది. దీంతో కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. గ్రామాల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్య

మీర్‌పేట: భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా మనస్తాపం చెందిన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా రాజపేట పాపయ్యతండాకు చెందిన రాములు, జానమ్మ(40)లు బతుకుదెరువు కోసం లెనిన్‌నగర్ ప్రశాంత్ నగర్‌కు వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ.. కూలీ పనులు చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా భర్త పనికి వెళ్లకపోవడంతో ఇదే విషయమై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో సోమవారం దంపతుల మధ్య మరోసారి గొడవ జరగగా.. జానమ్మ బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

పథకం ప్రకారమే హత్య

మహేశ్వరం: ఇటీవల హత్యకు గురైన రౌడీషీటర్ రియాజ్ హత్య కేసులో పోలీసులు పురోగతి సాధించారు. 20 ఏళ్ల నుంచి రౌడీషీటర్‌గా కొనసాగుతున్న ఆయన.. ఇటీవల తన ప్రత్యర్థి కుమారుడిని కిడ్నాప్ చేసి స్వలింగ సంపర్కానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో ప్రత్యర్థి వర్గం అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో రియాజ్ తనను అంతమొందిస్తారని భావించిన ప్రత్యర్థి వర్గం.. పథకం ప్రకారం అతన్ని మట్టుబెట్టినట్లు తెలిసింది. ఈ ఘటనలో దాదాపు 7–8 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించనున్నారు.

ముసురుకున్న నిర్లక్ష్యం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. వైద్యం కోసం రోగులు వచ్చి, డాక్టర్ల కోసం ఎదురు చూస్తున్నారు. అసలే వర్షాకాలం. ఆపై ముసురుకుంటున్న సీజనల్ వ్యాధులతో సతమవుతూ.. వైద్యమో నారాయణ అంటూ సర్కారు దవాఖాన గడప తొక్కిన రోగులకు.. వైద్యుల లేమితో నీరసించి పోతున్నారు. వైద్యం అందక ఆందోళన చెందుతున్నారు. చేసేది లేక ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్న వైనం 'సాక్షి' విజిట్‌లో సోమవారం వెలుగు చూసింది.

- ధర్మాస్పత్రుల్లో సరిగా అందని వైద్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత.. ఇబ్బందుల్లో రోగులు
- ఉన్నవారు సమయ పాలన పాటించని వైనం
- పలుచోట్ల నర్సులే వైద్యులుగా అవతారం
- పేరుకే 50 పడకల ఆస్పత్రి.. సేవలు ఓపీలకే పరిమితం



చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

చేవెళ్ల: నిత్యం వందల మంది రోగులు ధర్మాసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్నారు. కానీ.. వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో వైద్యసేవలు అందిస్తే మరింత బాగుంటుందని అటెండర్లు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలోని 50 పడకల ఏరియా ఆస్పత్రిలో కావాల్సిన వైద్య సిబ్బంది ఉంది. అయినప్పటికీ.. కేవలం ఓపీ సేవలకే పరిమితం అవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిత్యం 300 వరకు ఓపీ నమోదు అవుతుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సేవలు అందుతాయి. ఆస్పత్రిలో ఇన్ పేషంట్లుగా చేరే వారి సంఖ్య తక్కువగా ఉంటుంది. దీంతో పడకలన్నీ ఖాళీగానే ఉంటాయి. మధ్యాహ్నం తరువాత ఎవరూ ఉండక పోవడంతో ఆస్పత్రి నిర్మానుష్యంగా ఉంటుంది. దీంతో ఎవరికైనా అత్యవసర సేవలు అవసరమైతే.. ఎలా అని, 24 గంటల పాటు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ సివిల్ సర్జన్‌లు, డిప్యూటీ సివిల్ సర్జన్‌లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్‌పోస్టులు ఉన్నాయి. 11 మంది వైద్యులు ఉన్నారు. ఇందులో ముగ్గురు డిప్యుటేషన్లపై వెళ్లారు. ఫార్మా విభాగంలో మూడు పోస్టులు ఉండగా.. ఒక సూపర్‌వైజర్‌తో రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారు.

సకాలంలో వైద్యం అందక..



ఎల్మినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇబ్రహీంపట్నం రూరల్: పేరుకే ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం. కానీ.. రోగులకు వైద్య సేవలు అందించడంలో అక్కడి వైద్య సిబ్బంది విఫలమవుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎల్మినేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమయం పాలన పాటించిన వైద్యులతో రోగులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ఈ పీహెచ్‌సీకి పోచారం, ఎల్మినేడు, కొంగరకలాన్, ఆదిబట్ల, ఎంపీపటేల్ గూడ, మంగళ్‌పల్లి, బొంగ్లూర్, తులేకలాన్ గ్రామాల నుంచి నిత్యం 60 నుంచి 100 మంది రోగులు రకరకాల జబ్బులతో వస్తుంటారు. ఉదయం 9గంటలకు ఆస్పత్రి తెరిచినప్పటికీ.. 10.30 గంటలు దాటినా వైద్యుల జాడ కానరాదు. ఇద్దరు వైద్యులు, నలుగురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టులు ఉన్నప్పటికీ.. వీరెవరూ ఉండరు. ఇద్దరు స్టాఫ్ నర్సులు మాత్రం వైద్యుల అవతారం ఎత్తి.. రోగులకు తోచిన చికిత్స అందిస్తూ మమ అనిపిస్తున్నారు. 11 గంటల తర్వాత మీడియా వారు వచ్చారని సదరు ఉద్యోగులు చెప్పడంతో వైద్యులు హడావిడిగా ఆస్పత్రికి చేరుకున్నారు. కానీ.. విధుల్లో ఉన్నట్లు సమాధానం దాటవేశారు.

“సేవలు మెరుగు పరుస్తాం



ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తా. ఇటీవలే బదిలీపై వచ్చాను. వైద్యులు కొత్తవారే. అంతా కుదురుకున్నాక.. సేవలను విస్తృతం చేస్తాం. రోజు ఓపీ 300ల వరకు ఉంటుంది. ఎక్కువగా ఫీవర్, డయేరియా లాంటి కేసులు వస్తుంటాయి. అన్ని రకాల వైద్యపరీక్షలు చేసి, చికిత్స అందిస్తాం. గైనిక్ అందుబాటులో ఉన్నారు. డెలివరీలు, అవసరమైతే సిజేరియన్‌లు చేస్తున్నాం.

– డాక్టర్ రాజేంద్రప్రసాద్,
ఆస్పత్రి ఇన్‌చార్జి, చేవెళ్ల

సీహెచ్‌సీలో ల్యాబ్ సౌకర్యం నిల్

యాచారం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(సామాజిక ఆరోగ్య కేంద్రం)కి నిత్యం 200 మందికి పైగా రోగులు వస్తుంటారు. అందులో 50 శాతానికి పైగా సీజనల్ వ్యాధుల బారిన పడినవారే ఉంటున్నారు. అయితే వారికి ఎలాంటి వ్యాధి సోకిందో తెలుసుకోవడానికి ల్యాబ్ సౌకర్యం లేదు. వైద్యులు మాతం రక్త నమునాలను సేకరిస్తున్నారు. కాని వాటి ఫలితాలు ఎప్పుడు వస్తాయో తెలియదు దుస్థితి. దీంతో రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించక తప్పడం లేదు. ఇదే విషయమై వైద్యాధికారి రాజ్యలక్ష్మిని వివరణ కోరగా.. డెంగీ నిర్ధారణ టెస్టుల కోసం రక్త నమూనాలను సేకరించి కొండాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి పంపిస్తున్నామని తెలిపారు. 24 గంటల్లోనే రిజల్ట్ వస్తుందని పేర్కొన్నారు. సరిపడా మందులు ఉన్నాయని వెల్లడించారు.

పేరుకే 30 పడకల ఆస్పత్రి



మరుగు దొడ్డి వినియోగానికి డ్రమ్ములో నీరు

ఇబ్రహీంపట్నం: పేరుకే 30 పడకల ఆస్పత్రి. వైద్యులు ఉండరు. కనీస సౌకర్యాలు మృగ్యం. ఇది ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలోని ధర్మాసుపత్రి దుస్థితి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఔట్ పేషెంట్లను పరీక్షిస్తారు. ఆరుగురు వైద్యులకు ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. రోజుకొకరు విధులకు హాజరవుతారు. పరిసర ప్రాంతాల నుంచి సుమారు 200 మందికి పైగా రోగులు వస్తుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటితే వైద్యులు ఉండరు. ఏఎన్ఎంలు, నర్సులే రోగులకు దిక్కు. సూపరింటెండెంట్ రాధిక సోమవారం విధుల్లో పాల్గొనలేదు. ఇదిలా ఉండగా.. ఆస్పత్రిలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయి. డయాలిసిస్ రోగులు, గర్భిణులు, వారి సహాయకులుగా వచ్చేవారికి ఒకే మరుగుదొడ్డి ఉంది. కేవలం ఒక డ్రమ్ము, రెండు బకెట్లలో నింపిన నీరే దిక్కు. అవి ఏమాత్రం చాలవు. ఇన్ పేషెంట్లుగా ఎవరినీ చేర్చుకోరు. ఏ రకమైన ఆపరేషన్లు జరగవు. గతంలో కు.ని. జరిగేవి. మూడేళ్ల క్రితం ఆపరేషన్లు వికటించి ఆరుగురు బాలింతలు మృత్యువాతపడటంతో అవి నిలిపివేశారు. డెంగీ, చికున్ గున్యా లాంటి విష జ్వరాలు వస్తే ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిందే. కుక్క, పాము కాటుకు మందులున్నా.. ఆయా బాధితులను నర్సులే పరీక్షించి వాక్సిన్ వేస్తుంటారు.

అందుబాటులో ఔషధాలు



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ నిఖిత

కేశంపేట: చికున్‌గున్యా, డెంగీ వ్యాధికి అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని మండల వైద్యాధికారి, డాక్టర్ నిఖిత తెలిపారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో సీజనల్ వ్యాధుల పై సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఎవరికీ చికున్‌గున్యా రాలేదని, ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే అక్కడే వారికి మందులు ఇస్తున్నామని వెల్లడించారు. కుక్క, పాము, తేలు కాటుకు మందులు ఉన్నాయని ఆమె పేర్కొన్నారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య

ఆమనగల్లు: సీజన్ వ్యాధుల నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి రోగులు సంఖ్య పెరుగుతోంది. గతంలో చికిత్స నిమిత్తం నిత్యం సుమారు 150 మంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం 200కు పైగా వస్తున్నారు. రెండు మూడు రోజులు జ్వరం తగ్గని వారికి డెంగీ తదితర పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మలేరియా, డెంగీ వ్యాధి కేసులు రాలేదని వైద్యాధికారి డా.పరిక్షిత్ నరేందర్ తెలిపారు. కుక్క, పాముకాటు మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన చెప్పారు.

అన్నిరకాల వైద్యసేవలు

షాబాద్: పీహెచ్‌సీలో రోగులకు అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పాము, తేలు, కుక్కకాటుకు సంబంధించిన మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నిత్యం ఓపీ పేషంట్లు 70 మంది వరకు వస్తున్నారని, వారికి మెరుగైన వైద్యపరీక్షలు చేసి, మందులు అందిస్తున్నామని పేర్కొన్నారు. బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేస్తున్నామని వెల్లడించారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు డెంగీ, మలేరియా కేసులు నమోదు కాలేదని వెల్లడించారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారని ఆమె స్పష్టంచేశారు.

అందుబాటులో మందులు

తలకొండపల్లి: మండల కేంద్రంతో పాటు, గట్టుఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క, పాము, తేలు కాటుకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని డాక్టర్ స్నేహ తెలిపారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ జ్వరాలతో బాధపడుతున్న రోగులు మాత్రమే వస్తున్నారని, డెంగీ, చికున్ గున్యా కేసులు ఏమీ రాలేదని ఆమె పేర్కొన్నారు. గట్టుఇప్పలపల్లిలో ఒక్కరికి చికున్ గున్యా వచ్చినట్లు తెలిపారు.

స్టాఫ్ నర్సులే వైద్యులు



వైద్యం కోసం రోగుల నిరీక్షణ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం అవుట్ పేషెంట్ విభాగానికి సగటున 180–200 మంది రోగులు వస్తుంటారు. వీరిలో నెలలు నిండిన గర్భిణులతో పాటు కుక్క కాటు బాధితులు, డెంగీ జ్వర పీడితులు ఉంటారు. రోగుల నిష్పత్తికి తగినంత వైద్య సిబ్బంది లేరు. ఫలితంగా సకాలంలో వైద్య సేవలు అందక పేషంట్లు ఇబ్బంది పడుతున్నారు. ఆస్పత్రి పరిధిలో 12 బస్తీ దవాఖానాలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండగా, వీటిల్లో ముగ్గురు వైద్యులు మాత్రమే ఉన్నారు. మిగిలిన వాటిలో డాక్టర్లు లేకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్యుల అవతారం ఎత్తాల్సి వస్తోంది. కుక్క, పాముకాటు బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. అర్ధరాత్రి అత్యవసర పరిస్థితుల్లో ఉస్మానియా, గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు పరిగెత్తాల్సి వస్తోంది. ధర్మాసుపత్రి జీహెచ్ఎంసీ పరిధిలో ఉండటం వలన పరిసర ప్రాంత రోగులు ఇక్కడికే వస్తుంటారు.

వైద్యుల నియామకం లేదు



రోగులకు మందులు ఇస్తున్న సిబ్బంది

కందుకూరు: కందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి నెల రోజుల క్రితం ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో ముచ్చర్ల సబ్ సెంటర్లో పల్లె దవాఖానలో పని చేస్తున్న ఆయుష్ డాక్టర్ అఖిల ఇక్కడ పనిచేస్తున్నారు. అక్కడ విధులు ముగించుకుని, ఇక్కడికి వచ్చేసరికి ఉదయం 11 గంటలు అవుతోంది. దీంతో రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. నిత్యం రెండు మూడు కుక్కకాటు కేసులు వస్తున్నాయని సిబ్బంది తెలిపారు. కుక్క, పాము కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

పాముకాటుకు సూదిమందు లేదు



మైసిగండి పీహెచ్‌సీలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

కడ్తాల్: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఏ రోగం, నొప్పి వచ్చినా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లకు పరుగులు తీస్తున్నారు. మండల పరిధి మైసిగండి గ్రామంలో పీహెచ్‌సీ ఉన్నా.. పూర్తి స్థాయిలో సిబ్బంది లేరు. ఇందులో ఇద్దరు వైద్యులు ఉండగా, ఒకరు డిప్యుటేషన్‌పై వెళ్లగా.. మరో డాక్టర్ వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలో ఎంపీహెచ్ఈఓతో పాటు ఒక ఫార్మాసిస్ట్, ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు, ల్యాబ్ టెక్నిషియన్లు విధులు నిర్వహిస్తున్నారు. వైద్య పరికరాలు పూర్తి స్థాయిలో అందుబాటులో లేవు. ఇక్కడ పాము కాటుకు సూదిమందు లేదని, ఎవరైనా బాధితులు వస్తే.. ఆమనగల్లుకు రిఫర్ చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. తేలు, కుక్క కాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.